

అసైన్డ్ భూములకు పట్టా!

'ధరణి'లోని లొసుగులను ఆసరాగా చేసుకుని మాక్లూర్ మండలంలోని అసైన్డ్ భూములకు అధికారులు పట్టాలు చేస్తున్నారు.

- 8లో ▸



వార్డెన్లు కావలెను

సంక్షేమ హాస్టళ్లలో వార్డెన్ల కొరత వేధిస్తోంది. సంక్షేమాధికారుల పోస్టులు ఖాళీగా ఉండడంతో నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది.

- 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
34.0 /25.9

వాతావరణం

ఆకాశం మేఘావృతమవుతుంది. జిల్లాలోని పలుచోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు కురియవచ్చు.

న్యూస్‌రీల్

'గిరిరాజ్' డిగ్రీ పరీక్ష ఫలితాలు విడుదల

నిజామాబాద్ అర్బన్: గిరిరాజ్ ప్రభుత్వ కళాశాల డిగ్రీ పరీక్ష ఫలితాలు శుక్రవారం విడుదలయ్యాయి. తెలంగాణ యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారి ప్రొఫెసర్ అరుణ, కళాశాల ప్రిన్సిపాల్ రామ్మోహన్ రెడ్డి ఫలితాలను విడుదల చేశారు. మే నెలలో నిర్వహించిన బీఏ, బీకాం, బీబీఏ, బీఎస్సీ ఆరో సెమిస్టర్ పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. కళాశాలలో మొత్తం 86.93% ఉత్తీర్ణులైనట్లు పేర్కొన్నారు.

కొనసాగుతున్న కౌన్సెలింగ్

నిజామాబాద్ అర్బన్: పాలిటెక్నిక్ కళాశాలలో ఏప్ సెట్ కౌన్సెలింగ్ కొనసాగుతోంది. శుక్రవారం 175 మంది విద్యార్థులకు సంబంధించిన ధ్రువపత్రాలను పరిశీలించారు. ఈనెల 13వ తేదీ వరకు ప్రక్రియ కొనసాగుతోందని కౌన్సెలింగ్ సమన్వయకర్త శ్రీరాం కుమార్ తెలిపారు. ధ్రువపత్రాల పరిశీలన పూర్తయిన విద్యార్థులు ఆప్షన్లు పెట్టుకోవాలన్నారు. ఈనెల 15వ తేదీ వరకు వెబ్ ఆప్షన్ల ప్రక్రియకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

జాతీయ అవార్డుల కోసం దరఖాస్తు చేసుకోండి

నిజామాబాద్ అర్బన్: జిల్లాలోని ఉపాధ్యాయులు జాతీయ అవార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని డీఈవో దుర్గాప్రసాద్ ఓ ప్రకటన తెలిపారు. ఈ ఏడాది జాతీయస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల కోసం ఉపాధ్యాయులు వ్యక్తిగత దరఖాస్తులు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. ఈనెల 15వ తేదీలోగా అన్ని వివరాలతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

కురియన్ కమిటీకి కాంగ్రెస్ నేతల నివేదిక



ఖలీల్‌వాడి: పార్లమెంట్ ఎన్నికలపై సమీక్ష కోసం కాంగ్రెస్ పార్టీ నియమించిన కురియన్ కమిటీకి శుక్రవారం పార్టీ జిల్లా నాయకులు నిజామాబాద్ ఎంపీ స్థానానికి సంబంధించిన నివేదిక అందజేశారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో కురియన్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన మీటింగ్‌కు నిజామాబాద్ పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి, కాంగ్రెస్ బాల్కొండ నియోజకవర్గ ఇన్‌చార్జి సునీల్ రెడ్డి హాజరై నివేదిక ఇచ్చారు. పార్లమెంట్ పరిధిలోని ఆరు నియోజకవర్గాలకు సంబంధించిన వివరాలను ఈ నివేదికలో పొందుపర్చినట్లు తెలుస్తోంది.

ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

నిజామాబాద్‌అర్బన్: గ్రూప్–1 మెయిన్స్ కోసం ఈనెల 19 తేదీలోపు ఉచిత శిక్షణ కోసం దరఖాస్తు చేసుకోవాలని మైనారిటీ సంక్షేమ శాఖ అధికారిణి కృష్ణవేణి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర మైనారిటీ స్టడీ సర్కిల్లో అభ్యర్థులకు ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మైనారిటీలు(ముస్లింలు, క్రైస్తవులు, సిక్కుల, బుద్ధులు, జైనులు, పార్శీలు) తమ దరఖాస్తులను హైదరాబాద్‌లోని గన్ ఫౌండ్రిలో గల జామియా నిజామియా కాంప్లెక్స్‌లోని మూడో అంతస్తులో ఉన్న రాష్ట్ర మైనారిటీ స్టడీ సర్కిల్ కార్యాలయంలో అందించాలన్నారు. ఈనెల 22 నుంచి శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 040–23236112 నంబరును సంప్రదించాలన్నారు.

ఈ నెల 15న పెన్షన్ అదాలత్

సుభాష్‌నగర్: ఉద్యోగుల పెన్షన్ స్కీంకు సంబంధించిన సమస్యలను పరిష్కరించేందుకు పెన్షన్ అదాలత్‌ను ఈనెల 15న ఉదయం 11 గంటల నుంచి 11.40 గంటల వరకు నిర్వహించనున్నట్లు రీజినల్ పీఎఫ్ కమిషనర్–1 గణేశ్‌కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. సమస్య పరిష్కారానికి సంబంధించి ఫిర్యాదులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఫిర్యాదుదారులు వెబెక్స్ వెబ్‌సైట్‌లో మీటింగ్ నంబర్ 2641 582 8976, పాస్‌వర్డ్ పీడీఎస్1234 ఎంటర్ చేసి కాన్ఫరెన్స్‌లో పాల్గొనాలని ఆయన సూచించారు.





నగరంలో నిర్వహించిన జగన్నాథ రథయాత్రలో పాల్గొన్న భక్తులు, ఇన్‌సెట్‌లో ఉత్సవ మూర్తులు



ఘనంగా జగన్నాథ రథయాత్ర

- దూర ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు
- 56 రకాల నైవేద్యాల సమర్పణ
- అలరించిన విద్యార్థుల వేషధారణ

నిజామాబాద్‌అర్బన్: ఇందూర్ నగరంలో ఇస్కాన్ కంఠేశ్వర్ ఆధ్వర్యంలో శ్రీ జగన్నాథ రథయాత్ర కనుల పండువగా జరిగింది. నీలకంఠేశ్వరాలయం నుంచి నగరంలోని విజయలక్ష్మి గార్డెన్ వరకు నిర్వహించిన యాత్రకు.. వేలాది మంది భక్తులు తరలిరాగా భక్తిశ్రద్ధలతో రథయాత్ర సాగింది.

ఒడిశాలోని ప్రఖ్యాత పూరి క్షేత్రంలోని జగన్నాథ బలదేవ్ సుభద్రమయ సుదర్శన చక్ర రథయాత్ర అంటే ఎంతో ప్రసిద్ధి.. దీనిని ప్రతి యేటా నగరంలో ఇస్కాన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. నగరంలోని రథయాత్రకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. జగన్నాథునికి 56 రాకల నైవేద్యాలు సమర్పించారు. భజనాలు, కీర్తనలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ఆధ్యాత్మిక ప్రవచనాలు నిర్వహించారు. విద్యార్థులు కృష్ణుడు, రాధ వేషధారణతో అలరించారు. మున్సిపల్ కమిషనర్ మకరందు తాడు లాగుతూ ర్యాలీలో పాల్గొన్నారు. మహా హారతి, మహా ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి మాదవ్ స్వామి యాదవ్, ఇస్కాన్ ప్రతినిధులు రఘు, ఆదిపురుషం దస్, అశోక్ నీలైదాస్, నీతైచందుదాస్, ఆదిగురుదాస్, రమణ గోపీ దాస్, సర్వానత్ ప్రభు, నవరావ ముకుంద దాస్, సునీల్ అక్షయ్ సుమంత్ వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమం ఇస్కాన్ అధ్యక్షులు రామ నందరాయ్ గౌరదాస్ ప్రభుజీ ఆధ్వర్యంలో నిర్వహించారు. టింపుల్ అధ్యక్షులు శ్రీమన్ వేదంతా ప్రగతి, ఆర్‌ఎస్‌ఎస్ విభాగ్ ప్రచార శివకుమార్ పాల్గొన్నారు.



కోలాటం ఆడుతున్న మహిళలు

ఆయిల్‌పాంపై ఆసక్తి

- జిల్లాలో పెరుగుతున్న విస్తీర్ణం
- రెండేళ్లలో 4,600 ఎకరాల్లో సాగైన తోట
- ఈ ఏడాది లక్ష్యం 2,500 ఎకరాలు



డొంకేశ్వర్ మండలం నూత్‌పల్లి శివారులో పెరుగుతున్న ఆయిల్‌పాం తోట

డొంకేశ్వర్(ఆర్మూర్): ఆయిల్‌పాం సాగుపై జిల్లా రైతులు ఆసక్తి చూపిస్తున్నారు. మూడేళ్ల క్రితం పరిచయమైన ఈ పంటను సాగు చేసేందుకు తొలుత ఎవరూ ముందుకు రాలేదు. అయితే, క్షేత్రస్థాయిలో అధికారులు అవగాహన కల్పించడంతో గత రెండేళ్లలో కొంతమంది రైతులు ముందుకొచ్చారు. 2023 వరకు జిల్లాలో 1,900 మంది రైతులు 4,600 ఎకరాల్లో ఆయిల్‌పాంను సాగు చేస్తున్నారు. మూడేళ్ల కాలాన్ని పూర్తి చేసుకున్న చోట్ల వచ్చే ఏడాది కాత కాసి పంట చేతికి వచ్చే అవకాశాలున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లాకు ఈ సంవత్సరానికి కొత్త టార్గెట్‌ను నిర్దేశించారు. 2,500 ఎకరాల్లో ఆయిల్‌పాం తోటను సాగు చేయించాలని ఉద్యానశాఖకు లక్ష్యం ఉంది. ఇప్పటికే 537 మంది రైతులు ముందుకొచ్చి మొక్కల కొనుగోలుకు డీడీలు చెల్లించారు. 1,200 ఎకరాల్లో తోటను సాగు చేసేందుకు ఉద్యాన శాఖ నుంచి పరిపాలన అనుమతులివ్వగా, 200 ఎకరాల్లో ఆయిల్‌పాం మొక్కలను కూడా నాటారు. రైతులకు అవసరమయ్యే ఆయిల్‌పాం మొక్కలను సబ్సిడీపై అందజేసేందుకు ప్రభుత్వం జిల్లాలో ప్రత్యేక నర్సరీని ఏర్పాటు చేసింది. ఇది ఆర్మూర్ మండలం చేపూర్‌లో ఉండగా, దీనిని ప్రీ యూనిక్ ఇండియా ప్రైవేటు కంపెనీ నిర్వహిస్తోంది. ప్రస్తుతం ఇక్కడ జిల్లాకు సంబంధించిన ఆయిల్‌పాం మొక్కలు పెరుగుతున్నాయి. ఈ నర్సరీని ఉద్యాన శాఖ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించి రైతులకు మంచి మొక్కలు అందేలా చూస్తున్నారు.

సబ్సిడీలతో ప్రోత్సాహం..

ఆయిల్‌పాం సాగు చేసేందుకు ముందుకొచ్చిన రైతులకు ప్రభుత్వం సబ్సిడీ ఇస్తోంది. ఒక ఎకరానికి 50 మొక్కలు అవసరం అవుతుండగా, ఒక మొక్క ధర మార్కెట్‌లో రూ. 198 ఉంది. రైతులు తమ వాటాగా ఒక మొక్కకు రూ. 20 చెల్లిస్తే మిగతాది ప్రభుత్వం భరిస్తుంది. అలాగే ఆయిల్‌పాంలో అంతర పంటలు సాగుచేసే వారికి ఎకరానికి రూ. 2,100 చొప్పున నాలుగేళ్ల పాటు సబ్సిడీ ఇ స్తోంది. అదే విధంగా ఎరువుల కోసం ఎకరానికి రూ. 2,100 చొప్పున నాలుగేళ్ల పాటు సబ్సిడీని ఇస్తోంది. కాగా, బిందుసేద్యం యూనిట్లకు సైతం సబ్సిడీని అందజేస్తోంది.

రైతులు ముందుకురావాలి

ఈ ఏడాది జిల్లాకు కేటాయించిన లక్ష్యాన్ని చేరుకోవడానికి ప్రణాళిక బద్ధంగా పనిచేస్తాం. రైతులకు అవగాహన కల్పించి మరింతమంది ముందుకు వచ్చేలా చూస్తాం. ప్రభుత్వం ఇస్తున్న సబ్సిడీలను వివరిస్తాం. లాభదాయకమైన ఆయిల్‌పాం తోటను సాగు చేసేందుకు జిల్లాలోని రైతులు ముందుకు రావాలి.

– మధుసూదన్, జిల్లా ఉద్యాన శాఖ అధికారి

వైద్యులు సమయపాలన పాటించాలి

- లేదంటే చర్యలు తప్పవు
- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

వర్ని: ప్రభుత్వ ఆస్పత్రుల్లోని వైద్యులు సమయపాలన పాటించకపోతే శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు హెచ్చరించారు. శుక్రవారం వర్ని మండల కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రిని పరిశీలించారు. ఆస్పత్రిలో వైద్యులు సమయపాలన పాటించడం లేదని.. రోగులకు సరైన వైద్యం అందించడం లేదని స్థానికులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. 24 గంటల ఆస్పత్రిలో మధ్యాహ్నం రెండు తర్వాత ఏ ఒక్క డాక్టర్ కూడా ఉండడం లేదని వివరించారు. అత్యవసర వైద్య సేవలు అవసరముంటే నిజామాబాద్ వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడిందని కలెక్టర్‌కు తెలిపారు. తమకు మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వైద్యులు సమయపాలనపై విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్యశాఖ అధికారి తుకారాంను కలెక్టర్ ఆదేశించారు. అనంతరం సత్యనారాయణపురం, శ్రీనగర్ గ్రామాల్లో అమ్మ ఆదర్శ పాఠశాలల్లో అభివృద్ధి పనులను పరిశీలించారు. పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు వసతులను కల్పించాలని సూచించారు. అమ్మ ఆదర్శ పాఠశాలల్లో అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయన వెంట డీఈవో దుర్గాప్రసాద్, తహసీల్దార్ సాయిలు, ఎంపీవో చందర్ నాయక్, పంచాయతీ కార్యదర్శి సాయిలు ఉన్నారు.



వర్ని ఆస్పత్రిలో చికిత్స కోసం వచ్చిన వారితో మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

వర్సిటీలో విద్యార్థుల ఆందోళన



తెయూ పరిపాలనా భవనం ఎదుట బైఠాయించిన విద్యార్థులు

- విద్యార్థుల డిమాండ్‌తో వాయిదాపడ్డ పీజీ సెమిస్టర్ పరీక్షలు
- యూనివర్సిటీ అధికారుల ప్రకటన

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో ఈ నెల 15 నుంచి ప్రారంభం కాబోయే పీజీ నాలుగో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలను వాయిదా వేయాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. శుక్రవారం మధ్యాహ్నం ఏబీవీపీ ఆధ్వర్యంలో పీజీ విద్యార్థులు పెద్ద సంఖ్యలో ర్యాలీగా తరలివచ్చి పరిపాలనా భవనాన్ని ముట్టడించారు. భవనం ప్రధాన ద్వారం ఎదుట బైఠాయించి ఆందోళన నిర్వహించారు. గ్రూప్–2 పరీక్షలను దృష్టిలో ఉంచుకుని పీజీ సెమిస్టర్ పరీక్షలను వాయిదా వేయాలని డిమాండ్ చేశారు. చాలాకాలం తర్వాత గ్రూప్ –2 పరీక్షలు జరుగుతున్నాయని అదే సమయంలో పీజీ పరీక్షలు నిర్వహిస్తే తాము పోటీ పరీక్షలకు సన్నద్ధం కాలేకపోతామన్నారు. సుమారు రెండు గంటల పాటు ధర్నా చేయడంతో వర్సిటీ రిజిస్ట్రార్ యాదగిరి విద్యార్థుల వద్దకు వచ్చి మాట్లాడారు. విద్యార్థుల డిమాండ్‌ను ఇన్‌చార్జి వీసీ సందీప్‌కుమార్ సుల్తానియా దృష్టికి తీసుకెళతానని.. ధర్నా విరమించాలని కోరారు. అయితే పరీక్షలు వాయిదా వేస్తున్న స్పష్టమైన ప్రకటన చేస్తేనే ఇక్కడి నుంచి కదులుతామని విద్యార్థులు భీష్మించుకుని కూర్చున్నారు. వర్సిటీ అధికారుల సమాచారంతో డిచ్‌పల్లి సీఐ మల్లేశ్, ఎస్సై మహేశ్ సిబ్బందితో కలిసి పరిపాలనా భవనం వద్దకు చేరుకుని విద్యార్థులు నచ్చచెప్పినా వినలేదు. ఈ విషయమై రిజిస్ట్రార్ ఇన్‌చార్జి వీసీని సంప్రదించేందుకు యత్నించినా ఆయన స్పందించలేదు. దీంతో విద్యార్థులు రిజిస్ట్రార్ చాంబర్ ఎదుట బైఠాయించారు. రాత్రి 7 గంటల తర్వాత వర్సిటీ ఇన్‌చార్జి వీసీ ఆదేశాల మేరకు పరీక్షలను వాయిదా వేస్తున్నట్లు రిజిస్ట్రార్ యాదగిరి, కంట్రోలర్ అరుణ ప్రకటన విడుదల చేశారు. దీంతో విద్యార్థులు ధర్నా విరమించారు.

వివక్షకు తావిస్తే కఠిన చర్యలు

- 'మహిళా శక్తి' లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా ఉండాలి
- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు



మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, పాల్గొన్న అదనపు కలెక్టర్ అంకిత్

సుభాష్‌నగర్: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న మహిళాశక్తి కార్యక్రమం ద్వారా వివిధ యూనిట్ల స్థాపన కోసం పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేస్తామని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు స్పష్టం చేశారు. లబ్ధిదారుల ఎంపికలో వివక్ష ప్రదర్శిస్తూ పొరపాట్లకు ఆస్కారమిస్తే.. సంబంధిత ఏపీఎంలను బాధ్యులుగా పరిగణిస్తూ కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కలెక్టరేట్‌లోని సమావేశమందిరంలో శుక్రవారం మహిళా శక్తి కార్యక్రమంపై జిల్లా, మండల మహిళా సమాఖ్య ప్రతినిధులు, డీపీఎంలు, ఏపీఎంలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహిళలను ఆర్థికంగా మరింత ప్రగతిబాటలో పయనింపజేయాలనే సంకల్పంతో ప్రభుత్వం మహిళా శక్తి కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. విద్యార్థుల ఏకరూప దుస్తులను కుట్టిచ్చే బాధ్యతలతో పాటు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో ప్రభుత్వ బడుల్లో పనులను సైతం ఎస్‌హెచ్‌జీ సంఘాల ద్వారా కొనసాగిస్తోందని గుర్తుచేశారు. జిల్లాలో సుమారు 1.80 లక్షల యూనిఫాంలు కుట్టే బాధ్యతలను మహిళా సంఘాలకు అందిస్తున్నామని, ఒక్కోజత కుట్టుకూలీ రూ. 75 చొప్పున సుమారు రూ. కోటిన్నర వరకు ఆదాయం సమకూరుతుందని తెలిపారు. భవిష్యత్‌లోనూ వీరికి అంగన్‌వాడీ సెంటర్లు, రెసిడెన్షియల్ పాఠశాలల విద్యార్థుల యూనిఫాంలు కుట్టించే ఆర్డర్లు కూడా అందిస్తామన్నారు.

మహిళా శక్తి కార్యక్రమం ద్వారా మహిళా సంఘాల్లో ఔత్సాహిక సభ్యులకు వారి అభిరుచికి అనుగుణంగా వివిధ యూనిట్ల స్థాపన కోసం ఎంపిక చేసే ప్రక్రియ పూర్తి పారదర్శకంగా జరగాలని కలెక్టర్ ఏపీఎంలను ఆదేశించారు. ఆసక్తి, అభిరుచి, నైపుణ్యత, స్థానిక మార్కెట్ పరిస్థితులు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని సభ్యులను ఎంపిక చేయాలని సూచించారు. త్వరితగతిన యూనిట్ల గ్రౌండింగ్ కోసం చొరవ చూపాలని, ప్రతి యూనిట్ విజయవంతంగా కొనసాగేలా, తద్వారా మహిళా సాధికారత సాధించాలనే ప్రభుత్వ లక్ష్యం నెరవేరేలా అంకితభావంతో కృషి చేయాలని చెప్పారు. వచ్చేవారం మలివిడత సమావేశం నిర్వహిస్తామని, సమగ్ర వివరాలతో రావాలని సూచించారు. సదస్సులో అదనపు కలెక్టర్ అంకిత్, డీఆర్డీవో సాయాగౌడ్, లీడ్ బ్యాంకు మేనేజర్ అశోక్ చౌహాన్, పశు సంవర్ధక శాఖ జిల్లా అధికారి జగన్నాథ చారి, పరిశ్రమల శాఖ జిల్లా మేనేజర్ సురేష్ కుమార్, ఫిషరీస్ ఏడీ రాజనర్సయ్య పాల్గొన్నారు.

వనమహోత్సవం లక్ష్యాన్ని సకాలంలో పూర్తిచేయాలి

జక్రాన్‌పల్లి: వన మహోత్సవ లక్ష్యాన్ని సకాలంలో పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ అంకిత్ సూచించారు. శుక్రవారం జక్రాన్‌పల్లి మండలం కలిగోట్‌లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతి ఇంటి వద్ద మొక్కలు నాటేలా చర్యలు తీసుకోవాలన్నారు. వన మహోత్సవంలో స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాల సభ్యులు, విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. అనంతరం పడకల్‌లో ఆదర్శ రైతు రంగు దేవగౌడ్ వ్యవసాయ క్షేత్రంలో ఫాంపాండ్ పనులను పరిశీలించారు. ఎంపీడీవో సతీశ్‌కుమార్, ఏపీవో రవి పాల్గొన్నారు.



మొక్కలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ అంకిత్

క్లుప్తంగా

22లోగా బీఈడీ పరీక్ష ఫీజు చెల్లించాలి

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని బీఈడీ రెగ్యులర్ నాలుగో సెమిస్టర్, 2020–21 విద్యాసంవత్సరం 1, 2, 3, 4వ సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షల ఫీజు చెల్లింపునకు ఈ నెల 22 తుది గడువని కంట్రోలర్ ఎం అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. రూ.100 అపరాధ రుసుముతో ఈ నెల 23వ తేదీ వరకు ఫీజు చెల్లించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. వివరాలకు యూనివర్సిటీ వెబ్‌సైట్ www.telanganauniversity.ac.inను సంప్రదించాలని సూచించారు.

డిగ్రీ వన్‌టైం చాన్స్ బ్యాక్‌లాగ్ పరీక్షల్లో ఒకరి డిబార్

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ వన్‌టైం ఛాన్స్ బ్యాక్‌లాగ్ సెమిస్టర్ పరీక్షల్లో శుక్రవారం ఒకరు డిబార్ అయినట్లు అకడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్ ఘంటా చంద్రశేఖర్ తెలిపారు. గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ పరీక్షా కేంద్రంలో ఒక విద్యార్థి మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడుతూ డిబార్ అయినట్లు పేర్కొన్నారు. ఉదయం జరిగిన డిగ్రీ 5, 6వ సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షకు 111 మంది విద్యార్థులకు 102 మంది, మధ్యాహ్నం పరీక్షకు 228 మంది విద్యార్థులకు 216 మంది హాజరయ్యారు.

ఇంటర్ కాలేజీల తనిఖీ



నందిపేట్/మాక్లూర్: నందిపేట మండలం బలాపూర్, మాక్లూర్ ప్రభుత్వ జూనియర్ కాలేజీలను శుక్రవారం జిల్లా ఇంటర్ విద్యాధికారి రవికుమార్ పరిశీలించారు. గత సంవత్సరం ఫలితాలపై ఆరా తీశారు. ఈ ఏడాది ఆశించిన స్థాయిలో అడ్మిషన్లు రాలేవని, అధ్యాపకులు గ్రామాలకు వెళ్లి విద్యార్థులు ప్రభుత్వ కాలేజీల్లో చేరేలా అవగాహన కల్పించాలని సూచించారు. మూత్రశాలలు, మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రిన్సిపాల్స్ పెద్ది నారాయణ, గంగారాం పాల్గొన్నారు.

ఎస్సారెస్పీకి తగ్గిన ఇన్‌ఫ్లో

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఇన్‌ఫ్లో క్రమంగా తగ్గుతోంది. ప్రాజెక్ట్‌లోకి 400 క్యూసెక్కుల వరద నీరు వస్తోంది. ప్రాజెక్ట్ నుంచి అంతే స్థాయిలో ఔట్‌ఫ్లో ఉండటంతో ప్రాజెక్ట్ నీటి మట్టం నిలకడగా ఉంది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటి మట్టం 1091(80 టీఎంసీలు) కాగా శుక్రవారం సాయంత్రానికి 1061.90(12.44 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందని ప్రాజెక్ట్ అధికారులు తెలిపారు.

అసైన్డ్ భూములకు పట్టా!

- ముడుపులు తీసుకొని రిజిస్ట్రేషన్ చేస్తున్న అధికారులు
- ఏజెంట్లను నియమించుకొని దందా

మాక్లూర్: మాక్లూర్ మండలంలో అసైన్డ్ భూముల పట్టాలు జోరుగా సాగుతున్నాయి. ధరణిలోని లోసుగులను ఆసరాగా చేసుకొని అధికారులు అసైన్డ్ భూములకు పట్టాలు చేస్తున్నారు. ఏ జీవన ఆధారం లేని పేదలకు గతంలో ప్రభుత్వాలు భూములను పంచి పెట్టాయి. ఆ భూమిలో పంటలు సాగుచేసుకుని జీవనం సాగించాలి. కానీ అమ్మడానికి వీలులేదు. వారసత్వంగా మాత్రం మార్పిడి చేసుకోవచ్చు. కానీ కొందరు రెవెన్యూ అధికారులు లోసుగులను ఆసరగా చేసుకుని ఎకరానికి రూ.లక్ష 20 వేలు తీసుకుంటూ అక్రమంగా పట్టాలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. మండలంలో ఇద్దరు ఏజెంట్లను నియమించుకొని ఇప్పటికే మాక్లూర్, బొంకన్‌పల్లి, గొట్టిముక్కల, మెట్‌పల్లి, చిక్లి, గుంజ్లి, అమ్రాద్, చిన్నాపూర్, కొత్తపల్లి గ్రామాల్లో సుమారు 20 ఎకరాల అసైన్డ్ భూమిని ఇతరులకు పట్టా చేసినట్లు తెలిసింది. ఇందుకోసం కొన్నింటికి ఫేక్ సర్టిఫికెట్లు సృష్టించగా, మరికొన్నింటికి బంధుత్వం లేని వారిని వారసులుగా పేర్కొంటూ పట్టాలు చేసినట్లు సమాచారం.



అసైన్డ్ భూమికి రిజిస్ట్రేషన్ చేశారని తహసీల్ కార్యాలయాన్ని ముట్టడించిన చిన్నాపూర్ గ్రామస్తులు (ఫైల్)

రెండు ఎకరాల అసైన్డ్ భూమి నుంచి ఎకరం పట్టా చేయడానికి వీలు లేదు. ఉన్న రెండు ఎకరాల భూమి మొత్తం రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉంటుంది. ఇలాంటి క్రమంలో పట్టాదారు ఎకరం అమ్మితే ఆ భూమిని విక్రయదారుడికి నకిలీ సర్టిఫికెట్లతో పట్టా చేస్తున్నారు. మిగతా ఎకరాను అమ్మకందారు కుటుంబ సభ్యుల పేరుమీదకు మారుస్తున్నారు. దీంతో సదరు అధికారి రెండు వైపుల చెరో ఎకరం పట్టా చేసి ఇచ్చినందుకు రూ.2.40 లక్షలు తీసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. కాగా మాక్లూర్ తహసీల్దార్‌పై వస్తున్న ఆరోపణల నేపథ్యంలో ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి ఈ నెల 1న ధర్మోర మినీ లిఫ్ట్ పనుల ప్రారంభోత్సవం సందర్భంగా పరోక్షంగా హెచ్చరించిన విషయం తెలిసిందే.

వారసత్వ పట్టాలు చేశాను



వారసత్వంగా ఉన్న అసైన్డ్ భూములను మాత్రమే పట్టాలు చేయించి ఇచ్చాను. ఎక్కడ అక్రమాలకు పాల్పడలేదు. అన్ని పట్టాలు సక్రమంగానే చేశా.

– మహ్మద్ షబ్బీర్, తహసీల్దార్, మాక్లూర్

వార్డెన్లు కావలెను

- ఎస్సీ, బీసీ వసతి గృహాల్లో ఖాళీగా ఉన్న పోస్టులు
- ఇన్‌చార్జిలతో నెట్టుకొస్తున్న వైనం

మోర్తాడ్: సంక్షేమ హాస్టళ్లలో వార్డెన్ల కొరత వేధిస్తోంది. ఎస్సీ, బీసీ విద్యార్థి వసతి గృహాలను అజమాయిషీ చేసే సంక్షేమ అధికారుల పోస్టులు ఎక్కువ సంఖ్యలో ఖాళీగా ఉండటంతో హాస్టళ్ల నిర్వహణ అస్తవ్యస్తంగా తయారైంది. 2024–25 విద్యా సంవత్సరం ఆరంభం కావడంతోనే వసతి గృహాల్లో విద్యార్థులకు అడ్మిషన్లు జారీ చేశారు. కొన్నేళ్ల నుంచి వసతి గృహాల సంక్షేమ అధికారుల(వార్డెన్) పోస్టులు ఖాళీగానే ఉండటంతో ఇన్‌చార్జిలతోనే నెట్టుకొస్తున్నారు. జిల్లాలో 42 ఎస్సీ విద్యార్థి వసతి గృహాలు ఉంటే 30 మంది అధికారులే ఉన్నారు. 12 చోట్ల ఇతర హాస్టళ్ల వార్డెన్లకు అదనపు బాధ్యతలను నిర్వహిస్తున్నారు. బీసీ వసతి గృహాలు 22 ఉంటే వీటిలోను సగం ఖాళీలే ఉన్నాయి. ఒక్కో వార్డెన్‌కు ఒకటికి మించి అదనంగా హాస్టళ్ల బాధ్యతలను అప్పగించారు. అదనపు బాధ్యతలో పనిభారంతో వార్డెన్లు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల వసతి గృహాల సంక్షేమాధికారి పోస్టులకు రాత పరీక్షను నిర్వహించారు. ఆ పోస్టులు భర్తీ చేస్తేనే ఖాళీగా ఉన్న స్థానాలలో కొత్తవారిని నియమించే అవకాశం ఉంది. ప్రభుత్వం స్పందించి వీలైనంత తొందరగా పోస్టులను భర్తీ చేయాలని పలువురు కోరుతున్నారు.



మోర్తాడ్‌లోని ఎస్సీ బాలుర వసతి గృహం

ప్రొఫెసర్ల ఉద్యోగ విరమణ వయోపరిమితి పెంచాలి



సమావేశంలో పాల్గొన్న అధ్యక్షుడు గడ్డం మల్లేశ్, ఈసీ మెంబర్లు

తెయూ(డిచ్‌పల్లి): యూజీసీ నిబంధనల ప్రకారం ప్రొఫెసర్ల ఉద్యోగ విరమణ వయసు 65 ఏళ్లకు పెంచాలని తెలంగాణ ఆల్ యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ (టౌటా) ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఉస్మానియా యూనివర్సిటీలో టౌటా ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశంలో రాష్ట్రంలోని వివిధ యూనివర్సిటీల ఆఫీస్ బేరర్లు పాల్గొన్నారు. సమావేశంలో తెలంగాణ యూనివర్సిటీల సమస్యలపై చర్చించి పలు తీర్మానాలు చేశారు. యూజీసీ నిబంధనల మేరకు వయోపరిమితి 65 ఏళ్లకు పెంచాలని, పెండింగ్ బకాయిలను (ఆర్‌పీసీ –2016) వెంటనే చెల్లించాలని, యూనివర్సిటీల్లో పని చేసే ఉద్యోగులందరికీ హెల్త్ కార్డులు అందజేయాలని తీర్మానించారు. ఈ కార్యక్రమంలో టౌటా అసోసియేషన్ అధ్యక్షుడు గడ్డం మల్లేశం, ప్రధాన కార్యదర్శి సీహెచ్ శ్రీనివాస్, చల్లమల్ల వెంకటేశ్వర్లు, సిహెచ్ శ్రీనివాస్, ప్రొఫెసర్ వనజ ఉదయ్(పీఎస్‌టీయూ), బి విద్యాసాగర్ (పీజేటీఎస్‌ఏయూ), బి మంగు (ఓయూ), డాక్టర్ పున్నయ్య (తెయూ), సరస్వతమ్మ (టీఎంవీ), ఎన్ నర్సింలు పాల్గొన్నారు.

మరణిస్తూ నలుగురికి జీవితం

- యువకుడి బ్రెయిన్‌డెడ్
- అవయవాలు దానం చేసిన కుటుంబ సభ్యులు



ప్రవీణ్ (ఫైల్)

భిక్కనూరు: తాను చనిపోతూ మరో నలుగురికి జీవితాన్ని ఇచ్చాడు భిక్కనూరు మండలం పెద్దమల్లారెడ్డికి చెందిన మెట్టు ప్రవీణ్ (27). ప్రవీణ్ మెదక్ జిల్లా రామాయంపేటలోని ఓ బేకరిలో పనిచేసేవాడు. ఈ నెల 12న విధులు ముగించుకొని బైక్‌పై ఇంటికి వస్తుండగా రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. పరిస్థితి విషమంగా ఉండటంతో ఆయనను హైదరాబాద్‌లోని మల్లారెడ్డి ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రవీణ్ బ్రెయిన్ డెడ్‌కు గురయ్యాడు. అవయవ దానం చేయడంతో నలుగురికి మేలు కలుగుతుందని వైద్యులు ప్రవీణ్ కుటుంబీకులకు తెలిపారు. జీవన్‌దాన్ ట్రస్టు ప్రతినిధులు ఆస్పత్రికి వచ్చి చెప్పడంతో బాధిత కుటుంబ సభ్యులు అవయవదానానికి ఒప్పుకున్నారు. దీంతో కిడ్నీలు, లివర్, కార్నియ, ఊపిరితిత్తులను సేకరించారు. దీంతో ఆస్పత్రిలో ప్రవీణ్ మృతదేహం వద్ద వైద్యులు, సిబ్బంది ఘన నివాళులు అర్పించారు. ప్రవీణ్‌కు భార్య రేఖ, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు.



ప్రవీణ్ మృతదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న వైద్య సిబ్బంది

పూలు చల్లుతూ..

అవయవదానం చేసిన ప్రవీణ్ మృతదేహాన్ని అంబులెన్స్‌లో పెద్దమల్లారెడ్డికి తీసుకు వచ్చారు. గ్రామానికి చెందిన యువకులు గ్రామశివారులో నుంచి అంబులెన్స్‌పై పూల వర్షం కురిపిస్తూ ఆయన ఇంటి వరకు మృతదేహాన్ని తీసుకెళ్లారు. గ్రామంలో నిర్వహించిన అంతిమ యాత్రలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

మండలంలో ముగ్గురు

భిక్కనూరు మండలంలో ఇప్పటి వరకు ముగ్గురి అవయవాలు దానం చేశారు. భిక్కనూరుకు చెందిన బొందుగుల మాధురిలక్ష్మి అనే సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ రోడ్డు ప్రమాదంలో గాయపడి బ్రెయిన్ డెడ్‌కు గురవగా అర్గాన్స్ డొనేట్ చేశారు. పెద్దమల్లారెడ్డికి చెందిన శారద బ్రెయిన్‌డెడ్‌కు గురవగా కుటుంబ సభ్యులు అవయవదానం చేశారు. తాజాగా ప్రవీణ్ అవయవాలను దానం చేశారు.

నాన్ లేఅవుట్ వెంచర్లపై చర్యలు తీసుకోవాలి



సుభాష్‌నగర్: నగరంలోని మైనారిటీ ఏరియాల్లో నాన్ లేఅవుట్ వెంచర్లు విచ్చలవిడిగా వెలుస్తున్నాయని, పదేళ్లుగా దందా కొనసాగుతున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని కాంగ్రెస్ ప్రచార కమిటీ జాయింట్ కన్వీనర్ సయ్యద్ ఖైసర్ ఆరోపించారు. వెంటనే విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు. ఈమేరకు శుక్రవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ అంకిత్, కలెక్టరేట్ ఏవో ప్రశాంత్‌కుమార్, మున్సిపల్ అధికారులకు ఆయన వినతిపత్రం అందజేశారు. ఖైసర్ మాట్లాడుతూ.. బోధన్‌రోడ్‌తో పాటు మైనారిటీ ఏరియాలో అనుమతులు లేకుండా వెంచర్లు చేస్తున్నారని, ఎంఐఎం నాయకులు ప్రభుత్వ భూములు, చెరువులు కబ్జాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. నాన్ లే అవుట్ వెంచర్లతో ఏరియాలో పార్కులు, లైబ్రరీలు, హెల్త్ సెంటర్లు, క్రీడా మైదానాలు లేకుండా పోతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. స్లాటర్ హౌజ్ పక్కన బ్రహ్మం చెరువును ఎంఐఎం నాయకులు కబ్జా చేస్తున్నారని ఆరోపించారు. రామర్తి చెరువు స్థలంలో అక్రమంగా ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నారన్నారు. నాయకులు ఏజాజ్, మహమూద్, సర్ఫిల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాలన సేవా కేంద్రం పరిశీలన

డిచ్‌పల్లి: మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన సేవా కేంద్రాన్ని శుక్రవారం విద్యుత్ డివిజనల్(డిచ్‌పల్లి) ఇంజినీర్ ఉత్తమ్ జాడే సందర్శించారు. వివిధ కారణాలతో కొంతమంది అర్హులైన లబ్ధిదారులకు గృహజ్యోతి పథకం కింద ఉచిత కరెంట్ బిల్లులు రావడం లేదు. దీంతో ప్రభుత్వం లబ్ధిదారుల సమస్య పరిష్కారం కోసం ప్రజాపాలన సేవా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు డీఈ ఉత్తమ్ జాడే తెలిపారు. జీరో కరెంట్ బిల్లు రాకపోవడానికి కారణం సర్వీస్ కనెక్షన్ నెంబర్, రేషన్‌కార్డుకు అనుసంధానం కాకపోవడం, దరఖాస్తు నమోదులో తప్పులు దొర్లడం అని డీఈ తెలిపారు. ఇప్పటికే ప్రజాపాలన కోసం దరఖాస్తు చేసి జీరో బిల్లు రాని లబ్ధిదారులు మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సేవా కేంద్రంలో ప్రజాపాలన రసీదు, ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, కరెంట్ బిల్లులో ఉన్న సర్వీస్ నెంబర్(యూఎస్‌ఎన్)తో తప్పులను సవరింపజేసుకోవాలని ఆయన సూచించారు. డిచ్‌పల్లి ఏఈ సాయిలు, సిబ్బంది ఉన్నారు.



మాట్లాడుతున్న డిచ్‌పల్లి డీఈ ఉత్తమ్ జాడే

మేనేజింగ్ నైపుణ్యాలు పెంపొందించుకోవాలి



తెయూ(డిచ్‌పల్లి): విద్యార్థులు మేనేజ్‌మెంట్ నైపుణ్యాలు పెంపొందించుకోవాలని తెలంగాణ యూనివర్సిటీ ప్రొఫెసర్ సీహెచ్ ఆంజనేయులు సూచించారు. తెయూ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో ఈవెంట్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా శుక్రవారం వర్సిటీ మేనేజ్‌మెంట్ అండ్ కామర్స్ కాలేజీలో విద్యార్థులకు క్యాంపస్ లెవల్ డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ఈవెంట్ మేనేజర్లుగా దుశ్యంత్, ఇన్రస్, శ్రావణి వ్యవహరించారు. ఆంజనేయులు మాట్లాడుతూ.. విద్యార్థులు తమ నైపుణ్యాలు ప్రదర్శించడానికి ఇలాంటి ఈవెంట్లలో పాల్గొనాలన్నారు. పోటీల్లో సీహెచ్ అనూజ ప్రథమ, ఎస్ పూజ ద్వితీయ, సుహాసిని తృతీయ బహుమతి సాధించారు. కార్యక్రమంలో వర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ ఆరతి, అధ్యాపకులు ప్రొఫెసర్ ఖైసర్ మహ్మద్, వాణి తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

చీరతో ఉరిపడి బాలుడి మృతి



ఎడపల్లి: చీరతో ప్రమాదవశాత్తు ఉరి పడి బాలుడు మృతి చెందిన ఘటన మండలంలోని జానకంపేట్‌లో చోటు చేసుకుంది. ఎస్సై వంశీచందర్‌రెడ్డి తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన టేకులపల్లి నవదీప్(14) ఇంట్లోని సామగ్రిని సజ్జ(సెల్ఫ్) మీద పెట్టడానికి అక్కడ కట్టిన ఊయలలాగా కట్టిన చీరపై ఎక్కాడు. సామను సర్దుతుండగా కింద పడగా చీరతో ఉరి పడింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరు లేరు. తర్వాత నవదీప్ తల్లి ఇంట్లోకి వచ్చి చూసే సరికి ఉరి పడి ఉండటంతో ఆస్పత్రికి తరలించగా అప్పటికే చనిపోయాడని వైద్యులు తెలిపారు. బాలుడి తండ్రి వినోద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

కరెంట్ షాక్‌తో యువకుడు..



గాంధారి: మండలంలోని నేరల్‌లో కరెంట్ షాక్‌తో హరిజన నవీన్(27) మృతి చెందినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. వివరాలు.. ఇంట్లో సీలింగ్ ఫ్యాన్ తిరగడం లేదని నవీన్ స్టూలుపై ఎక్కి పరిశీలిస్తుండగా ప్రమాదవశాత్తు షాక్ తగిలి కింద పడిపోయాడు. దీంతో తలకు బలమైన గాయమైంది. వెంటనే కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం మండల కేంద్రంలోని ఓ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి తల్లి యాదమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

లారీ ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి..

ఖలీల్‌వాడి: లారీ ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన నగరంలో శుక్రవారం చోటు చేసుకుంది. నాందేవ్‌వాడ రైల్వేగేట్ సమీపంలో ఓ లారీని డ్రైవర్ రివర్స్ తీసుకుంటుండగా దానికింద పడి గుర్తు తెలియని వ్యక్తి(45) మృతి చెందినట్లు ఎస్సై ప్రవీణ్ తెలిపారు. డ్రైవర్ అజాగ్రత్తగా రివర్స్ తీసుకోవడంతో ప్రమాదం జరిగిందన్నారు. నిజాం కాలనీకి చెందిన షేక్ సోయల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

జీవితంపై విరక్తితో యువకుడి ఆత్మహత్య



నిజాంసాగర్: మండలంలోని మల్లూర్ గ్రామానికి చెందిన అద్దగళ్ల సాయిలు(22) జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలు.. అద్దగళ్ల ఉమలత, సంజీవుల పెద్ద కుమారుడైన సాయిలు ఇంటర్ వరకు చదివాడు. నెల క్రితంహైదరాబాద్ వెళ్లి ప్రైవేట్ కంపెనీలో పని చేస్తున్నాడు. ఇటీవల గ్రామానికి వచ్చిన సాయిలు శుక్రవారం తెల్లవారు జామున గ్రామంలోని శ్మశాన వాటిక వద్ద చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు.

మనస్తాపంతో ఒకరు..

మాక్లూర్: కుటుంబ కలహాలతో మనస్తాపం చెంది ఒకరు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని అమ్రాద్‌లో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన పూల శ్రవణ్‌కుమార్(36) రెండు రోజుల క్రితం ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. పలుచోట్ల గాలించినా ఆచూకీ లభించలేదు. గురువారం సాయంత్రం నర్సింగ్ కాలేజీ దగ్గరలో అటవీ ప్రాంతంలో ఆయన మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులు సమాచారం ఇచ్చారు. కుటుంబ సమస్యలతో ఉరి వేసుకున్నాడని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

అటవీ భూమి ఆక్రమణపై ఫిర్యాదు

మోపాల్: మండలంలోని మంచిప్ప శివారులోగల రేసులకుంట మైసమ్మ వద్ద అటవీ భూమిలో చెట్లు నరికేసి సాగు చేస్తుండటంపై అటవీశాఖ అధికారులకు ఫిర్యాదు అందింది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సెక్షన్ ఆఫీసర్ సాయికృష్ణ, బీట్ ఆఫీసర్ సాయికుమార్ ఘటనా స్థలాన్ని శుక్రవారం పరిశీలించారు. వివరాలు.. మంచిప్ప శివారులోని రేసులకుంట మైసమ్మ వద్ద అటవీ భూమిలో అమ్రాబాద్ తండాకు చెందిన పలువురు చెట్లు నరికి సాగు చేయడానికి సిద్ధమయ్యారు. ఈవిషయమై మంచిప్ప గ్రామస్తులు సెక్షన్, బీట్ ఆఫీసర్ల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదు. కానీ ఇటీవల మంచిప్ప గ్రామస్తులు రాజులమర్రి గుట్ట వద్ద అటవీభూమిలో మొక్కజొన్న సాగు చేయగా, అమ్రాబాద్‌వాసులు వాటిని ధ్వంసం చేశారు. అంతటితో ఆగకుండా అటవీశాఖ అధికారులకు ఫిర్యాదు చేయడంతో ఏడుగురిపై కేసు నమోదు చేశారు. ప్రస్తుతం అమ్రాబాద్ గ్రామస్తులు అటవీ భూమిలో సాగు చేస్తున్నా.. అధికారులు పట్టించుకోవడం లేదని మంచిప్ప గ్రామస్తులు మండిపడుతున్నారు. దీనిపై మంచిప్ప గ్రామస్తులు ఎఫ్‌ఆర్‌ఓ రాధికకు ఫిర్యాదు చేయగా, ఆమె ఆదేశాల మేరకు సెక్షన్, బీట్ ఆఫీసర్లు, వీడీసీ ప్రతినిధులు చెట్లు నరికేసిన ప్రాంతాన్ని పరిశీలించారు. వారి నివేదిక ఆధారంగా అటవీశాఖ చట్టం ప్రకారం చెట్లు నరికేయడమే కాకుండా భూమిని సాగు చేస్తున్న ఏడుగురిపై కేసు నమోదు చేయనున్నట్లు ఎఫ్‌ఆర్‌ఓ రాధిక తెలిపారు.



అటవీ భూమిని పరిశీలిస్తున్న అటవీ అధికారులు

అటవీ భూమిపై పంచాయితీ

మండలంలోని మంచిప్ప, అమ్రాబాద్ గ్రామాల మధ్య అటవీ భూమిపై పంచాయితీ మొదలైంది. రేసులకుంట మైసమ్మ, రాజులమర్రి గుట్ట రెండూ మంచిప్ప శివార్లలో ఉన్నప్పటికీ.. ఇరు గ్రామాల ప్రజలు పరస్పరం ఫిర్యాదులు చేసుకున్నారు. అటవీ భూమిని సాగు చేయడం, చెట్లు నరికేయడం తప్పుగా భావించి అధికారులు కేసులు నమోదుచేశారు.

మక్క పంట ధ్వంసం చేసిన వారిపై కేసు

గాంధారి: మండలంలోని సోమారం తండాకు చెందిన రైతు మొక్కజొన్న పంటను కొత్తాబాది తండాకు చెందిన రైతులు ధ్వంసం చేసినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. వివరాలు.. కొత్తాబాది తండా, సోమారం తండా శివారులో 754 కంపార్ట్‌మెంటులో మూడు ఎకరాల అటవీ భూమి పట్టాను సోమారం తండాకు చెందిన బాదావత్ దస్నుబాయికి ప్రభుత్వం ఇచ్చింది. ఈ భూమి విషయంలో ఇరు తండాల రైతులు గతంలో గొడవపడి పోలీస్ స్టేషన్ ఫిర్యాదు చేసుకున్నారు. ఆ ఫిర్యాదును ఎస్సై రెవెన్యూ, అటవీ అధికారులకు అప్పగించారు. అటవీ అధికారులు విచారణ చేసి సదరు భూమిని దస్నుబాయికి ఇచ్చినట్లు నిర్ధారించారు. అధికారులు ఇరు తండాల రైతులను రాజీ కుదిర్చిపంపారు. హక్కు పత్రం ఉన్న దస్నుబాయి ఆ భూమిలో 20 రోజుల క్రితం మొక్కజొన్న సాగు చేశారు. గురువారం రాత్రి కొత్తాబాది తండా రైతులు ట్రాక్టర్లతో మొక్కజొన్న పంటను దున్నేశారు. బాధిత రైతు ఫిర్యాదు మేరకు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.



ధ్వంసమైన పంటను పరిశీలిస్తున్న ఎస్సై

చోరీ కేసులో ముగ్గురికి జైలు

ఎల్లారెడ్డి: బైక్ చోరీకి పాల్పడిన ముగ్గురికి ఎల్లారెడ్డి మున్సిఫ్ కోర్టు న్యాయమూర్తి హారిక ఐదు నెలల చొప్పున జైలు శిక్ష విధించినట్లు ఎస్సై మహేశ్ గురువారం తెలిపారు. మండలంలోని ఆడివిలింగాలకు చెందిన కుమ్మరి రాజు బైక్‌ను నాగిరెడ్డిపేట మండలం జలాల్‌పూర్‌కు చెందిన దొడ్ల గోపాల్, ఎర్ర అశోక్, అత్మకూర్ గ్రామానికి చెందిన మిద్దె రాజు కలిసి మార్చి 28న చోరీ చేశారు. న్యాయమూర్తి దొంగలకు ఐదు నెలల జైలు శిక్ష విధించారు.

ఎల్లారెడ్డిలో బైక్ దగ్ధం

ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డిలోని శ్రీరామ కాలనీలో శుక్రవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు బైక్‌ను దగ్ధం చేశారు. పట్టణంలోని ముబీన్ తన బైక్‌ను రాత్రి ఇంటి ఆవరణలో నిలిపాడు. ఆ బైక్‌ను దుండగులు కాలబెట్టారు.

బాగుంటుందని రైలెక్కేశారు..

- ఇద్దరు పిల్లల అదృశ్యంపై పోలీసులకు ఫిర్యాదు
- మహబూబ్‌నగర్‌లో లభ్యమైన పిల్లల ఆచూకీ



ఉమేర్, ఆసిఫ్

కామారెడ్డి క్రైం: ఇద్దరు చిన్నారుల మిస్సింగ్ ఉదంతం ఎట్టకేలకు సుఖాంతమైంది. రైలు ప్రయాణంపై వారికున్న ఆసక్తి రెండు కుటుంబాలను దాదాపు ఒక రోజు పాటు ఆగం చేసింది. పిల్లల ఆచూకీ దొరకడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. వివరాలు ఉన్నాయి. జిల్లా కేంద్రంలోని డ్రైవర్స్ కాలనీకి చెందిన ఆసిఫ్ (8), ఉమేర్ (12) అనే ఇద్దరు విద్యార్థులు స్థానికంగా ఉండే ఓ మదర్సాలో చదువుకుంటున్నారు. గురువారం సాయంత్రం వారు ఇంటికి తిరిగి రాలేదు. మదర్సాకు వెళ్లి చూడగా అక్కడ కూడా లేరు. చాలా చోట్ల గాలించినా ఆచూకీ దొరకక పోవడంతో వారి తల్లిదండ్రులు శుక్రవారం ఉదయం 6 గంటలకు దేవునిపల్లి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఉమేర్ తండ్రి బాబర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన దేవునిపల్లి పోలీసులు పిల్లల కోసం వెతకడం ప్రారంభించారు. బంధువులు, అంతా కలిసి చుట్టుపక్కల ప్రాంతాల్లో గాలింపు చర్యలు చేపట్టారు. చివరికి వారు ఇద్దరూ మహబూబ్‌నగర్‌లో బాలల సంరక్షణ కేంద్రంలో ఉన్నట్లు కామారెడ్డి పోలీసులకు సమాచారం వచ్చింది. మహబూబ్‌నగర్ రైల్వే ప్లాట్ ఫాంపై తచ్చాడుతున్న వారిద్దరిపై అనుమానం వచ్చి విచారించిన రైల్వే పోలీసులు అక్కడి బాలల సంరక్షణ కేంద్రంలో చేర్పించడంతో పాటు కామారెడ్డి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో వారు క్షేమంగా ఉన్నట్లు నిర్ధారణ కాగా తల్లిదండ్రులు, బంధువుల ఊపిరి పీల్చుకున్నారు. గతంలో ఆసిఫ్ తన తండ్రితో కలిసి రైలులో ఢిల్లీ వరకు వెళ్లి వచ్చాడు. రైలు ప్రయాణం చాలా బాగుంటుందని ఉమేర్‌తో చెప్పగా అప్పటి నుంచి వారిలో రైలులో ప్రయాణించాలనే కోరిక పెరిగింది. ఇద్దరూ కలిసి రైలు ప్రయాణాన్ని ఆస్వాదించే ఉద్దేశంతోనే గురువారం సాయంత్రం కామారెడ్డి రైల్వే స్టేషన్ నుంచి ఓ గుర్తు తెలియని రైలు ఎక్కి మహబూబ్ నగర్ వరకు ప్రయాణం చేసినట్లు తెలుస్తుంది. కాగా దేవునిపల్లి పోలీసులు వారిని తీసుకువచ్చేందుకు మహబూబ్‌నగర్‌కు వెళ్లారు. రెండు రోజుల పాటు ప్రభుత్వ కార్యాలయాలకు సెలవులు ఉండటంతో సోమవారం పిల్లలను పోలీసులకు అప్పగించే అవకాశాలు ఉన్నట్లు తెలిసింది.